
AP 4PG 16 10 2025 thursday qxp_Layout 1 16-10-2025 05:48 AM Page 1

విలేకరులు కావలెను

ఆంధ్ర తెలంగాణ రెండు తెలుగు రాష్ట్రాలలో
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్స్, మండల
రిపోర్టర్, కంట్రిబ్యూటర్స్, యాడ్ ఎగ్జిక్యూటివ్స్, కావలెను
తెలుగు భాషపై అవగాహన, వార్తలు రాయగల సత్తా
ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును
JBN NEWS 24/7
MOBILE : 8886090199, 9885211993,

అనంత ప్రభ
తెలుగు దిన పత్రిక



అనంతపురం
శ్రీ సత్యసాయి
5
గురువారం 16 అక్టోబర్ 2025

# కోటి సంతకాలతో ప్రభుత్వానికి కళ్లు తెరిపిద్దాం..! మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

- పీపీపీ విధానాన్ని విరమించుకోవాలి
- వైద్య కళాశాలలను ప్రభుత్వమే నిర్వహించాలి



రాప్తాడు, అక్టోబర్ 15 (అనంత ప్రభ)
రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి నాడు పేద ప్రజలకు ఉచిత వైద్య విద్యం అందాలని రాష్ట్ర వ్యాప్తంగా 17 మెడికల్ కళాశాలల నిర్మాణానికి శ్రీకారం చుట్టారని. ఆయన ఉన్నత ఆశయానికి గండికోడుతున్న కూటమి సర్కార్ వైఖరికి వ్యతిరేకంగా కోటీ సంతకాలు సేకరించి చంద్రబాబు కళ్లు తెరిపిద్దామని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి అన్నారు..మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా బుధవారం రాప్తాడు మండలం ఎం. బండమీదపల్లి గ్రామాల్లో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులకు వైద్య విద్యను అభ్యసించేందుకు, ప్రజలకు మెరుగైన వైద్యం అందజేసేందుకే గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాష్ట్రంలో 17 నూతన మెడికల్ కాలేజీల నిర్మాణం చేపడితే వాటిని కూటమి ప్రభుత్వం ప్రైవేటు పరం చేసి నీర్వీర్యం చేస్తోందన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేసి రూ.వేల కోట్లు దండు కోవడానికి చంద్రబాబు కుట్రలు పన్నుతున్నారని మండిపడ్డారు. దీనికి నిరసనగా వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. పేదలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందించాలనే ఉద్దేశంతో దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి ఆరోగ్యశ్రీ పథకానికి శ్రీకారం చుట్టారన్నారు. జగనన్న మరో రెండు అడుగులు ముందుకేసి రూ.25 లక్షల వరకు ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా కార్పోరేట్ వైద్యం అందించేలా చర్యలు తీసుకున్నారన్నారు.ఈ క్రమంలోనే పేదలకు మరింత నాణ్యమైన వైద్య సేవలు, వారి పిల్లలు ఉచితంగా వైద్య విద్య అభ్యసించేలా దేశ చరిత్రలో ఏ ముఖ్యమంత్రి చేయలేని విధంగా 17 ప్రభుత్వ వైద్య కళాశాలలకు అనుమతులు తెచ్చారన్నారు. ఇందులో జగనన్న హయాంలోనే 5 కళాశాలలను నిర్మించి అడ్మిషన్లు మొదటు పెట్టి తరగుతులు మొదలయ్యేలా చర్యలు తీసుకున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మిగిలిన 12 కళాశాలల్లో అడ్మిషన్లు వద్దంటూ కేంద్రానికి లేఖ చంద్రబాబు రాశాడని, నిర్మాణాలు కూడా ఆపేయాలని జీఓ ఇచ్చారన్నారు. తాజాగా వాటిని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు.కొత్తగా వచ్చిన 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలు పూర్తయితే లక్షమందికి ఉపాధి లభించేదన్నారు. పైసా ఖర్చు లేకుండా ఏటా 5 వేల మంది వైద్యులయ్యే అవకాశాన్ని చిదిమేశారన్నారు.చంద్రబాబుకు అమరావతిలో రాజధాన్ని నిర్మాణంలో ఉన్న శ్రద్ధ మెడికల్ కాలేజీలపై లేదన్నారు. అమరావతిలోని టీడీపీ నేత భూములకు దరలు పెంచుకునేందుకే రాజధాని నిర్మాణాంపై ప్రత్యేక దృష్టి పెడుతున్నారని ఆరోపించారు. ఏడాదిన్నర కాలంలో తెచ్చిన రూ. లక్షల కోట్లు అప్పులు ఏంచేశారని ప్రశ్నించారు. జగనన్నకు మంచి పేరు వస్తుందనే కక్షతోనే చంద్రబాబు కుట్రపూరితంగా మెడికల్ కాలేజీలను ప్రైవేటుకు అప్పగిస్తున్నారని విమర్శించారు.నకిలీ మద్యం పాపం చంద్రబాబుదే రాష్ట్రంలో నకిలీ మద్యం పాపం చంద్రబాబుదేనని తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి మండిపడ్డారు. స్పిరిట్, నీళ్లు, రంగుపొడి కలిపి కావాల్సిన బ్రాండ్లు తయారు చేసి అమ్మకాలు చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వంలో పేద, మధ్య ప్రజలను టార్గెట్ చేసి కల్తీ మద్యాన్ని తయారు చేసి అమ్ముతున్నారని అన్నారు. పేదలు డబ్బు ఇచ్చి విషం కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో మద్యం షాపుకంటే మెల్ట్ షాపులే అధికయ్యాయని తెలిపారు. వెంటనే ప్రభుత్వం బెల్ట్ షాపులను రద్దు చేయాలన్నారు. ఈ మద్యం తాగడం వలనే మహిళల మెడలోని తాళిబొట్లు తెగిపోతున్నాయని, ఈ మరణాలు ప్రభుత్వ ఖాతాల్లో లేవన్నారు. మరణించిన వారికి ప్రభుత్వమే పరిహారం చెల్లించాలన్నారు.జగనన్నకు రాప్తాడు నియోజకవర్గాన్ని గిఫ్ట్ గా ఇచ్చేద్దాం రాష్ట్రంలో రాప్తాడు నియోజకవర్గాన్ని వచ్చే ఎన్నికల్లో అత్యదిక మోజార్టీతో గెలిపించి జగనన్నకు గిఫ్ట్ గా ఇచ్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రాప్తాడు నియోజకవర్గంలో ప్రతి గ్రామాన్ని ఎంతో అభివృద్ధి చేశామన్నారు. ఎం.బండమీదపల్లి గ్రామానికి రూ.కోటి రూపాలయతో సీసీ రోడ్లు నిర్మించామన్నారు. మళ్లీ జగనన్న సీపీఎం అయితేనే మన గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు.

## కలెక్టర్ అధ్యక్షతన జిల్లా ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం



అనంతపురం, అక్టోబర్ 15 (అనంత ప్రభ)
అనంతపురం ప్రభుత్వాసుపత్రిలో గతం కంటే సౌకర్యాలు మెరుగుపడ్డాయని రోగులకు మెరుగైన వైద్యం అందుతోందని.. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. అనంతపురం నగరంలోని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఛైర్మన్ గా ఉన్న కలెక్టర్ ఓ.ఆనంద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కో ఛైర్మన్ హోదాలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, కమిటీ సభ్యులు, సూపరింటెండెంట్, డిఎంహెచ్వో, వైద్యులు, అధికారులు పాల్గొన్నారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై కలెక్టర్ ఎమ్మెల్యే ఆరా తీశారు. ఎన్టీఆర్ వైద్య సేవలకు సంబంధించిన నిధుల గురించి చర్చించారు. మరోవైపు ఆసుపత్రిలో ఉన్న బెడ్స్ కంటే అడ్మిషన్ లో ఉండే పేషెంట్లు ఎక్కువగా ఉన్నారని వైద్యులు ఈ సమావేశంలో ప్రస్తావించారు. ఈ పరిస్థితిని అధిగమించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఆనంద్ తెలిపారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితిని మెరుగు పరుస్తామని చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ గత ఐదేళ్లలో ఆసుపత్రిలో అధ్వాన్న పరిస్థితులు ఉండేవన్నారు. గత 10నెలల నుంచి ఈ పరిస్థితిలో మార్పు వచ్చిందని గతం కంటే ఆసుపత్రిలో పరిస్థితి మెరుగుపడిందన్నారు. ఇంకా చేయాల్సినవి చాలా ఉన్నాయన్నారు. గత సమావేశంలో చర్చకు వచ్చిన సమస్యలు పరిష్కారమయ్యాయన్నారు. ప్రస్తుతం 15 కోట్ల రూపాయలతో పనులు కూడా జరుగుతున్నాయన్నారు. ఆసుపత్రిలో వైద్యులు ఇతర సిబ్బందిని త్వరలోనే నియామకాలు జరుగుతాయన్నారు. అవసరమైన ఎక్విప్మెంట్ కూడా ప్రభుత్వం నుంచి తీసుకొస్తామన్నారు. ఎన్టీఆర్ వైద్య సేవలకు సంబంధించిన నిధుల గురించి కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. రోగులకు మెరుగైన వైద్యం అందించాలన్నదే తమ లక్ష్యమని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వాసుపత్రి సూపర్డెంట్ సుబ్రహ్మణ్యం, డిఎంహెచ్వో ఈ.బి. దేవి, ఆర్ఎంవో డాక్టర్ హేమలత, సభ్యులు కోణంకి గంగారం, విశాలా ఫెర్రర్, రవికాంత్ వెంకటరమణ, రత్నమయ్య, వైద్యులు, ఆరోగ్యశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు

## ఉద్యమ హెూరులో పార్టీ జెండా నిరుపేదలకు అండా..!

- 11వ రోజుకు చేరుకున్న ఉద్యమం
- ప్రభుత్వ చెరువు పట్టగా మారితే మరి ఎఫ్ఎంబి లో చెరువు ఎందుకు
- నాటి కబ్జా పై ఆరా తీస్తాం
- సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ, ఏఐఎంకెఎస్



కూడేరు, అక్టోబర్ 15 (అనంత ప్రభ)
కూడేరు మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో సర్వేనెంబర్ 93 లో ఇల్లు లేని పేద ప్రజల ఉద్యమం 11వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా జిల్లా కోశాధికారి రాయుడు మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయల కాలం నాటి చెరువు బ్రిటిష్ కాలంలో గుర్తింపు పొందిన చెరువు పట్టా గా మారిన వైనాన్ని బట్టలు బయలు చేస్తామని నాటి కబ్జాపై ఆరా తీస్తామని సిపిఐ ఎంఎల్ అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కోశాధికారి రాయుడు అన్నారు. ఉద్యమాలు కొనసాగించే క్రమంలో నిరుపేద ఆశయాలను నీరుగార్చే ఎలాంటి దుష్ట శక్తులు ఎదురైనా అవలీలగా ఎదుర్కొనే శక్తి సామర్థ్యాలు ఉద్యమాలు ఊపిరి పోసుకున్నప్పుడే నేర్చుకున్నామని జిల్లా కోశాధికారి రాయుడు అన్నారు. ప్రభుత్వం భూమి పేదలకు చెందిన వరకు వదిలి పెట్టేది లేదంటూ నిరుపేద ప్రజలు ఇంటి స్థలాల కోసం 150 మందితో వేసిన కొట్టాలు నేడు 1751 చేరుకున్నాయని. అయితే ఇప్పటికే కబ్జాదారుల గుండెల్లో మాత్రం రైళ్లు పరిగెడుతున్నాయని, దాంతో కబ్జాదారులు ఉన్నపలంగా దుష్ట శక్తులకు ఊతమిచ్చిన సరే భూకబ్జాదారుల తాటాకు చప్పుళ్ళకు మాత్రం భయపడేది లేదంటూ సిపిఐ ఎంఎల్ న్యూ డెమొక్రసీ అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కోశాధికారి రాయుడు దీటుగా సమాధానం ఇచ్చారు.మండల వ్యాప్తంగా ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడుతుంటే రెవెన్యూ అధికారులు మాత్రం అంటి ముట్టినట్లు వ్యవహరిస్తున్నారని. అసలే వర్షాకాలం తాగడానికి గుక్కెడు నీళ్లు లేక ఫ్లోరైడ్ నీటితో దాహం తీర్చుకుంటూ విషప్రాణుల సంచరిస్తూ వాటి మధ్య రాత్రి అయితే ఆంజనేయస్వామి గుడి ముందు నీవే దిక్కు స్వామి..అంటూ వారు పడుతున్న తీరు కొన్ని పత్రికలకు కనపడకపోవడం చాలా బాధాకరం, అయితే ఒకసారి రాత్రింబవళ్లు ఇక్కడికి వస్తేగానీ ఈ పేద ప్రజలు పడే అవస్థలు కొన్ని అనుకూల వర్గాలకు మాత్రం కనిపించవు.. ఇక్కడ వర్షపు చినుకులు పడ్డాయి అంటే అడుగు వేసి అడుగు వేయలేని పరిస్థితి అయినప్పటికీ తమ సొంతింటి కల నెరవేర్చుకోవడానికి ప్రాణాల సైతం అర్పించడానికి సిద్ధమయ్యారు. కుటుంబాల సైతం ఇక్కడ సేద తీరుతున్నాయి. ఇక్కడున్న వారిలో ముసలి వారు సైతం చావో రేవో తేల్చుకుంటామని భీష్మించు కూర్చున్నారు. షుగర్ పేషెంట్లు, బీపీ పేషెంట్లు సమయానికి మందులు వేసుకోలేక ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడున్న రైతులకి వారి యొక్క ప్రాణాలకు ఎటువంటి హాని కలిగిన పూర్తిగా రెవెన్యూ శాఖ బాధ్యత వహించాలని ఇక్కడున్న పేద ప్రజలు మీడియా ముందు తెలియజేశారు. ఉన్నతాధికారులు స్పందించి సర్వే నెంబర్ 93 లో కబ్జాదారుల కోరల చిక్కుకున్న భూమి ని స్వాధీనం చేసుకొని ఇల్లు లేని పేదలకు ఆ స్థలాలను పంచేవ్వాలని అఖిలభారత రైతు సంఘం జిల్లా కోశాధికారి రాయుడు తెలిపారు.

## అనంత వెంకట రామి రెడ్డి గారి ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం



అనంతపురం, అక్టోబర్ 15 (అనంత ప్రభ)
వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు, ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వై.యస్.ఆర్.సి.పి. జిల్లా అధ్యక్షులు శ్రీ అనంత వెంకట రామి రెడ్డి గారి ఆధ్వర్యంలో స్థానిక ఆర్ట్స్ కళాశాల ఎదురుగా ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలో చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో ఉమ్మడి అనంతపురము జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ శ్రీమతి బోయ గిరిజమ్మ గారు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు, తల్లిదండ్రులతో గత ప్రభుత్వంలో విద్యా వ్యవస్థలో, శ్రీ వై.యస్ జగన్ మోహన్ రెడ్డి గారు తీసుకువచ్చిన విప్లవాత్మక మార్పుల గురించి మరియు కొత్తగా మంజూరు చేసిన 17 మెడికల్ కళాశాల గురించి వివరిస్తూ, ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంతకాలను సేకరించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ గారు మాట్లాడుతూ పేద విద్యార్థి కూడా పెద్ద చదువులు చదువుకోవాలనే ఉద్దేశ్యంతో మాజీ ముఖ్యమంత్రి శ్రీ వై.యస్. జగన్ మోహన్ రెడ్డి గారు గత ప్రభుత్వంలో విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకు వచ్చారని, అందులో భాగంగా వైద్య విద్య అందరికి చేరువగా అందుబాటులో ఉండాలని కొత్తగా 17 మెడికల్ కాలేజీలు మంజూరు చేశారు. కాని ప్రస్తుత కూటమి ప్రభుత్వం విద్యను ప్రైవేటుపరం చేసే దిశగా, ఈ మెడికల్ కళాశాలను ప్రైవేటీకరణ చేయడం వైద్య విద్య చదువుకోవాలనే కలలు కనే ఒక సగటు విద్యార్థికి అన్యాయం చేయడం అని, దీనికి ప్రజలు, విద్యార్థులు పూర్తి వ్యతిరేకంగా ఉన్నారని, దీనికి కోటి సంతకాల సేకరణకు వస్తున్న స్పందనే ఋజువని, కూటమి ప్రభుత్వం వెంటనే ఈ ఆలోచన ఉపసంహరించుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ మేయరు, డిప్యూటి మేయర్లు, కార్పొరేటర్లు, వైసీపీ అనుబంధ సంఘ అధ్యక్షులు, వైసీపీ సీనియర్ నాయకులు, మహిళా నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## టపాసుల విక్రయాలకు అనుమతులు తప్పనిసరి...సీఐ కౌలుట్లయ్య



శింగనమల, అక్టోబర్ 15 (అనంత ప్రభ)
దీపావళి పండుగ సందర్భంగా అనంతపురం జిల్లా శింగనమల సర్కిల్ పరిధిలో తాత్కాలిక టపాకాయల దుకాణాలు నెలకొల్పేవారు దరఖాస్తు చేసుకుని అనుమతి తప్పనిసరిగా పొందాలని శింగనమల సీఐ కౌలుట్లయ్య తెలియజేశారు.సర్కిల్ పరిధిలోని శింగనమల,నార్పల,గార్లదిన్నె మండలాలోని టపాసుల విక్రయదారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా సీఐ కౌలుట్లయ్య మాట్లాడుతూ అనుమతి లేకుండా టపాకాయల దుకాణాలను నెలకొల్పితే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.టపాకాయల దుకాణాలు సంబంధిత నిర్ణయించిన ఖాళీ ప్రదేశాల్లో నెలకొల్పాలని, ఖాళీ ప్రదేశానికి సంబంధించిన ఎన్.ఓ.సి సర్టిఫికెట్ పొందుపర్చాలని, జనావాస ప్రదేశాల్లో ఎలాంటి టపాకాయల షాపుల ఏర్పాటు చేయరాదని అన్నారు. అదేవిధంగా కళ్యాణ మండపాలలో, సమావేశాల కేంద్రాలలో టపాకాయల దుకాణాలు నెలకొల్పరాదని, తాత్కాలిక టపాకాయల దుకాణాల వద్ద అగ్ని ప్రమాదాలు సంభవించకుండా దుకాణదారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, సంబంధిత అన్ని శాఖల నుండి అనుమతి పత్రాలను పొందిన తర్వాతనే దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలని, దుకాణదారులు తమ సమీపంలో ఇసుక, తగినంత నీటిని అందుబాటులో ఉంచుకోవాలని పలు సూచనలు చేశారు.అనంతరం నాగులగుడ్డం తాండా వద్ద వున్న టపాసుల గోడాన్ ను తనిఖీ చేయడం జరిగింది.గోడాన్ వద్ద తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి వివరించడం జరిగింది.ఫైర్ అడ్జసింగ్ మిషన్స్ తప్పనిసరిగా దగ్గర ఉంచుకోవాలి. ప్రతి దుకాణానికి కనీసం 20 అడుగుల దూరం పాటించాలి. విద్యుత్ కనెక్షన్ తీసుకున్నాను వారు నూతన వైరు ఏర్పాటు చేసుకొని ఎటువంటి ఇబ్బంది లేకుండా చూసుకోవాలి. నీళ్ల డ్రమ్ములు మరియు ఇసుక బకెట్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. తప్పనిసరిగా అన్ని నిబంధనలు తప్పకుండా పాటించాలని తెలియజేశారు.

## జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో అబ్దుల్ కలాం చిత్ర పటానికి పుష్పనివాళులు



అనంతపురం, అక్టోబర్ 15 (అనంత ప్రభ)
భారత మాజీ రాష్ట్రపతి శ్రీ అబ్దుల్ కలాం గారి జయంతిని పురస్కరించుకుని స్థానిక జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరం నందు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉమ్మడి అనంతపురము జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ శ్రీమతి బోయ గిరిజమ్మ గారు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మొదటగా కలాం గారి చిత్ర పటానికి పుష్పనివాళులు అర్పించారు. అనంతరం చైర్ పర్సన్ గారు మాట్లాడుతూ భారత రత్న పురస్కార గ్రహీత అబ్దుల్ కలాం గారు మిస్సైల్ మ్యాన్ గా భారత కీర్తిని ప్రపంచవ్యాప్తంగా చాటిచెప్పి, కళలు కనండి, వాటిని సాకారం చేసుకోండి అని గొప్ప స్ఫూర్తిప్రదాతగా నిలిచారని, రాష్ట్రపతిగా దేశానికి ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. భావితరాలు ప్రతి ఒక్కరూ ఆ మహనీయుని ఆశయ సాధనలో పాలుపంచుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణ అధికారి శ్రీ జి.శివ శంకర్ గారు, ఉప ముఖ్య కార్య నిర్వహణ అధికారి శ్రీ జి.వెంకట సుబ్బయ్య గారు, కార్యాలయ పరిపాలనాధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## నరేంద్ర మోడీ గో బ్యాక్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ గౌని ప్రతాప్ రెడ్డి



రాయదుర్గం, అక్టోబర్ 15 (అనంత ప్రభ)
కర్నూలు జిల్లాకు వస్తున్నటువంటి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారు మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఇచ్చినటువంటి హామీలను పూర్తిగా అమలు చేయలేదు కాబట్టి, ఈ రాష్ట్రానికి వచ్చే నైతిక హక్కు వారికి లేదని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాం. నరేంద్ర మోడీ 2014 ఎన్నికల ముందు అనేక హామీలతో గద్దెనెక్కిన తర్వాత హామీలను మర్చిపోయి రాష్ట్రం పూర్తిగా సర్వనాశనమైతున్న కూడా ఇప్పటి కూడా రాష్ట్రంలో భాగస్వామ్యమైనటువంటి పార్టీలు చూసి చూడనట్టుగా స్వప్రయోజనాల కోసం రాష్ట్ర భవిష్యత్తును నరేంద్ర మోడీ గారికి తాకట్టు పెట్టారు.
మనకు రావాల్సినటువంటి నిధులు నియామకాలను రేపు నరేంద్ర మోడీ గారిని అడిగి మన రాష్ట్ర భవిష్యత్తును కాపాడుకోవాలని తెలియజేస్తున్నాను.. అని తెలిపారు, రాయదుర్గం యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ అనిల్ మాట్లాడుతూ ప్రత్యేక హోదా, పోలవరం నిధులు, జిల్లాలకు ప్రత్యేక గుర్తింపు ఇతరత్రా విషయాలను కూడా ప్రధాన మంత్రివర్యులు దృష్టికి తీసుకెళ్లి ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు కోసం పోరాడాలని హితవు పలికారు

## తాడిపత్రి కూరగాయల మార్కెట్ ను పరిశీలించిన కార్యదర్శి గౌస్



ఉరవకొండ, అక్టోబర్ 15 (అనంత ప్రభ)
ఉరవకొండ గ్రామపంచాయతీ నందు నూతనంగా కూరగాయలమార్కెట్ ఏర్పాటు చేయుటకు ఆర్థిక శాఖమంత్రివర్యులు పయ్యావుల కేశవులు , పయ్యావుల శ్రీనివాసులు ఆదేశాల మేరకు తాడీపత్రి లో ఉన్న వెజిటేబుల్ మార్కెట్ ను బుధవారం పంచాయతీ కార్యదర్శి గౌస్ పరిశీలించారు.

## చేతులు శుభ్రత పై విద్యార్థులకు అవగాహన



ఉరవకొండ, అక్టోబర్ 15 (అనంత ప్రభ)
ఉరవకొండ పట్టణములో ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా ఉరవకొండ సెంట్రల్ స్కూల్ లో చేతులు ఎలా శుభ్రం చేసుకోవాలి , అనే విషయం పై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉరవకొండ -1సచివాలయం నుండి ఎ.యన్.యం. పిల్లలకు వివరించడం జరిగింది. చేతులు ఎలా శుభ్రం చేసుకోవాలి అనే విషయంపై తొమ్మిది సూత్రాలు పాటించాలి అని 1.చేతులు నీటితో తడి చేసుకోవాలి. 2.సబ్బును చేతులతో తిసుకోవాలి. 3 అర చేతులు ఖాలీగా కలుపుతూ రుద్దుకోవాలి. 4.చేతి వేళ్ళ మద్య రుద్దుకోవాలి. 5.చేతి బొటన వేలి మధ్యలో రుద్దుకోవాలి. 6.చేతి వేళ్ళ చివరలో రుద్దుకోవాలి. 7.మణి కట్టు వరకు శుభ్రం చేసుకోవాలి. 8,నీటితో పూర్తిగా శుభ్రం చేసుకోవాలి. 9.తువాలు తో చేతులు తుడుచుకోవాలి పై 9 సూత్రాలు ఖచ్చితంగా పాటించాలి అని లేకుంటే నారి కురుపు, కడుపు నొప్పి వంటివి సంక్రమిస్తాయని ఏఎన్ఎంజయలక్ష్మి పిల్లల కు వివరించడం జరిగింది. కార్యక్రమంలో సెంట్రల్ హై స్కూల్,హింది పండిట్ వేదవతి , ఆశ వర్కర్ లు ప్రమీళ , శారద , స్వచ్ఛ భారత్ మండ కో ఆర్డినేటర్ యం. జయప్రకాష్ గౌడ్ పాల్గొనడం జరిగింది

## ఎక్సైజ్ చెక్ పోస్ట్ తనిఖీ




ఉరవకొండ, అక్టోబర్ 15 (అనంత ప్రభ)
అనంతపురము జిల్లా ప్రొహిబిషన్ %డ% ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు విడపనకల్ ఎక్సైజ్ చెక్ పోస్ట్ ను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రోహిబిషన్ %డ% ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ పి. నాగమద్దయ్య , డిస్ట్రిక్ట్ ప్రోహిబిషన్ %డ% ఎక్సైజ్ ఆఫీసర్ బి. రామమోహన రెడ్డి , అసిస్టెంట్ ప్రొహిబిషన్ %డ% ఎక్సైజ్ సూపరింటెండెంట్ (ఎన్ఫోర్స్మెంట్) ఎం. శ్రీరామ్ చెక్ పోస్ట్ ద్వారా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం లోకి వచ్చే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, అక్రమంగా వచ్చే మద్యం రవాణాను పూర్తిగా అరికట్టాలని చెక్పోస్ట్ అధికారులకు, సిబ్బందికి తగిన మార్గనిర్దేశనం చేశారు. అక్రమ రవాణా పై ప్రత్యేకంగా ఉంచాలన్నారు. ఈ తనిఖీ కార్యక్రమంలో ఉరవకొండ ఎక్సైజ్ రవిచంద్ర సిబ్బంది పాల్గొన్నారు .

## తాడిపత్రి దూదేకుల సేవా సంఘం కార్యాలయంలో ఘనంగా అబ్దుల్ కలాం జయంతి

తాడిపత్రి, అక్టోబర్ 15 (అనంత ప్రభ)
నూర్ భాషా ముస్లిం (దూదేకుల) సేవా సంఘం ఆధ్వర్యంలో
అనంతపురం జిల్లా తాడపత్రి పట్టణంలో పుట్లూరు రోడ్ టిటిడి కళ్యాణమండపం వద్ద దూదేకుల సేవా సంఘం కార్యాలయంలో ఆయన రాష్ట్రపతి ఏపీజే డాక్టర్ పద్మశ్రీ అవార్డు అబ్దుల్ కలాం పటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు ప్రెసిడెంట్ దూదేకుల కోటేగంటి హుస్సేన్ పీరా, సెక్రెటరీ వి హుస్సేన్ పీరా (తాళ్ల పొద్దుటూరు),, గౌరవ అధ్యక్షులు సంఘం ఫక్రుద్దీన్, గౌరవ అధ్యక్షులు సమాచార హక్కు జిల్లా ఉపాధ్యక్షులు కోటెగంటి నబి రసూల్,, గౌరవ సలహాదారుడు కడియాల పెద్ద హాజీ, అబ్దుల్ రజాక్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు
అవుల్ పకీర్ జైనులబ్దీన్ అబ్దుల్ కలాం, భారతదేశం గర్వించదగిన శాస్త్రవేత్త, విద్యావేత్త మరియు భారతదేశ



11వ రాష్ట్రపతి. అక్టోబర్ 15న ఆయన జయంతిని ప్రతి సంవత్సరం జరుపుకుంటారు. ఆయన రామేశ్వరంలో పేద కుటుంబంలో పుట్టి, క్షిపణి సాంకేతిక పరిజ్ఞానంలో విశేష కృషి చేసి, "మిస్సైల్ మ్యాన్"గా ప్రసిద్ధి చెందారు. రాష్ట్రపతిగా తన నిరాడంబరమైన విధానాలు, ప్రజలతో అనుబంధం కారణంగా "పీపుల్స్ ప్రెసిడెంట్"గా పేరు పొందారు.

## సి డి పి ఓ సాజిదా బేగం అధ్యక్షతన ఎన్టిఆర్ ఫంక్షన్ హాల్ లో రాష్ట్రీయ పోషణ మాసం 2025 కార్యక్రమం

తాడిపత్రి, అక్టోబర్ 15 (అనంత ప్రభ)
రాష్ట్రీయ పోషణ మాసం 2025 కార్యక్రమం సి డి పి ఓ సాజిదా బేగం అధ్యక్షతన ఎన్టిఆర్ ఫంక్షన్ హాల్ లో ప్రోగ్రాం జరిగినది. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 16 వరకు జరుపబడుతుంది, ప్రధానంగా ఈ పోషణ మాసం యొక్క ముఖ్య ఉద్దేశం స్థూలకాయం నివారణకు చక్కెర మరి నూనె వినియోగం తగ్గించాలి, బాల్య దశ సంరక్షణ మరియు విద్య ,మరియు శిశు మరియు చిన్నపిల్లల ఆహారపు అలవాట్లు,పురుషుల భాగస్వామ్యం పోషణ మరియు సంరక్షణ పురుషుల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం స్థానికానికి మద్దతు గ్రామీణ శక్తికి మార్గం పోషణకు బలమైన పునాది సమన్వయ చర్యలు మరియు డిజిటలీకరణ ద్వారా సమగ్ర పోషణ బలమైన అడుగు అని, ఆరోగ్యవంతమైన మహిళ శక్తివంతమైన కుటుంబానికి పునాది. కావున నెల రోజులు జరిగే ఈ కార్యక్రమానికి క్యాలెండర్ ప్రకారం ప్రతిరోజు ఒక్కొక్క పని చొప్పున చేస్తూ ఆరోగ్యవంతమైన సమాజాన్ని



చేయాలని అదేవిధంగా ఇంటర్నేషనల్ గర్ల్ చైల్డ్ డే కార్యక్రమంలో భాగంగా కొంతమంది బాలికలకు లింగ వివక్షత,బాల్య వివాహ నిర్మూలన, చట్టాలు వాటి మీద కొంతమంది బాలికలు మాట్లాడినందుకు వారికి బహుమతి ప్రధానోత్సవం కూడా జరిగినది. మరియు పరిశుభ్రతలో భాగంగా చేతుల పరిశుభ్రత వంటి అంశాల మీద అంగన్వాడీ టీచర్స్ కు అవగాహన కల్పించడం జరిగినది. ఈ కార్యక్రమంలో తాడిపత్రి ప్రాజెక్ట్ సూపర్వైజర్స్ మరియు అంగన్వాడి కార్యకర్తలు అందరూ హాజరు కావడం జరిగినది

## ఉరవకొండలో ఆర్ఎస్ఎస్ విజయదశమి ఉత్సవం ఘనం : ముఖ్య అతిథిగా సౌభాగ్య

ఉరవకొండ, అక్టోబర్ 15 (అనంత ప్రభ)
అనంతపురం జిల్లా, ఉరవకొండ నియోజకవర్గంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ఆధ్వర్యంలో విజయదశమి ఉత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఉరవకొండలోని ఎస్ కె జూనియర్ కళాశాల ప్రాంగణంలో బుధవారం సాయంత్రం 4:00 గంటలకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ఉత్సవానికి భారతీయ జనతా పార్టీ నాయకురాలు, ఉరవకొండ నియోజకవర్గానికి చెందిన శ్రీమతి సౌభాగ్య దగ్గుపాటి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ యొక్క ముఖ్య ఉద్దేశాలు మరియు కార్యక్రమాల గురించి సభికులకు వివరంగా తెలియజేశారు. జాతీయ భావజాలాన్ని, సేవా స్ఫూర్తిని పెంపొందించడంలో ఆర్ఎస్ఎస్ పాత్రను ఆమె కొనియాడారు.



ముఖ్య వక్తగా శ్రీమతి సునీత మరియు శ్రీమతి శ్రీదేవి టీచర్ , ఆర్ఎస్ఎస్ వన్నూర్ స్వామి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఎస్ కె కళాశాల విద్యార్థినీ విద్యార్థులు, స్వయం సేవకులు మరియు స్థానిక ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ వేడుక హిందూ సంస్కృతి మరియు జాతీయ సమైక్యతను ప్రతిబింబించింది

## బిజెపి ఆధ్వర్యంలో ధన్వంతరి జయంతి తిరుపతి లో అక్టోబర్ 18 జరిగే సభ కు జిల్లా నుంచి తరలి రండి

ఉరవకొండ, అక్టోబర్ 15 (అనంత ప్రభ)
"అమృత మూర్తి ధన్వంతరి జయంతి"
సౌందర్యం - సంజీవనం - సంగీతం
ప్రతిబింబించేలా భారత సాంస్కృతిక జీవన ప్రయాణంలో భాగమైన నాయీ బ్రాహ్మణ సోదరులతో కలసి భారతీయ జనతా పార్టీ ధన్వంతరి జయంతి "సంజీవని స్వరం" పేరున ఈ నెల 18 న ది అంగరంగ వైభవంగా తిరుపతి గాంధీ భవన్ వద్ద నిర్వహిస్తున్నది ఇప్పటికే రాష్ట్రంలో నాయీ బ్రాహ్మణ నాయకులు కళాకారులు వైద్యులతో సమావేశాలు నిర్వహించి అందరిని సంఘటితం చేసాము ఈ సందర్భంగా కార్యక్రమ పోస్టర్ ను నాయీ బ్రాహ్మణ నాయకులు భజంత్రీ నాదస్వర కళాకారులు ఆయుర్వేద వైద్యులతో కలసి విడుదల చేశాము ఈ కార్యక్రమంలో ధన్వంతరి శోభాయాత్ర, వివిధ స్వదేశీ స్టాల్స్ మరియు సభ వుంటుంది నాయీ బ్రాహ్మణ కళాకారులు చేతివృత్తిదారులు వివిధ ఆయుర్వేద వైద్యులు పాల్గొనే కనువిందైన ఈ కార్యక్రమం ను విజయవంతం చేయాలని భారతీయ జనతా ఒబిసి మోర్చా ఆంధ్రప్రదేశ్



శాఖ పిలుపునిస్తుంది. ప్రియతమ భారత ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన ఆత్మనిర్భర్ భారత్ వికసిత భారత్ లక్ష్యాలలో అందరూ భాగస్వామ్యం అవ్వాలి ఈ లక్ష్యాలు నెరవేర్చాలి అంటే స్వదేశీ ఉద్యమంలో పాల్గొనాలి "స్వ" సంస్కృతి ని చేతి వృత్తులు సాంప్రదాయ వృత్తులు గురు పరంపర వృత్తులను గౌరవించాలి మరియు కాపాడుకోవాలి ఆయా సమాజాలు గౌరవాన్ని పొందాలి. 18న ఉదయం 8 గంటలకు తిరుపతి గాంధీ భవన్ వద్ద నిర్వహించే ధన్వంతరి జయంతి సంజీవిని స్వరం కార్యక్రమం ను పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిస్తున్నాము .

## క్రికెట్ క్రీడలో రాష్ట్రస్థాయికి ఎంపికైన కేజీబీవీ సౌమ్య




ఆత్మకూరు, అక్టోబర్ 15 (అనంత ప్రభ)
అనంతపురం లోని పిటిసి గ్రౌండ్ నందు అండర్ 19 ఎస్ ఎఫ్ జి జిల్లా స్థాయి ఎంపికలు అక్టోబర్15 న జరిగినవి .అందులో ఆత్మకూర్ కస్తూరిబా గాంధీ పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న సౌమ్య రాష్ట్ర స్థాయికి క్రికెట్ క్రీడకు ఎంపిక కావటం జరిగింది. ఈ సందర్భంగా సౌమ్య ని ప్రిన్సిపాల్ లీమారోస్, పీఈటీ మంజుల, బోధన, బోధనేతర సిబ్బంది అభినందించారు.

## జిల్లా కలెక్టర్ ను కలిసిన యంగ్ ప్రొఫెషనల్స్




అనంతపురం, అక్టోబర్ 15 (అనంత ప్రభ)
అనంతపురం జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ ను జిల్లా యంగ్ ప్రొఫిషనల్స్ నేడు కలెక్టర్ కార్యాలయంలోని ఆయన చాంబర్ నందు మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గాల అభివృద్ధి, పి4 కార్యక్రమాల గురించి ప్రొఫెషనల్స్ కలెక్టర్ కు వివరించారు. పి4 సచివాలయ అధికారులతో సమన్వయం చేసుకొని నియోజకవర్గ పరిధిలో అభివృద్ధికి పాటుపడాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ యంగ్ ప్రొఫెషనల్స్ కు సూచించారు.

## గ్యార్మి పండుగ సందర్భంగా అన్నదాన కార్యక్రమం



శింగనమల, అక్టోబర్ 15 (అనంత ప్రభ)
శింగనమల మండల కేంద్రం గరిడీ లో గార్మి పండగ సందర్భంగా అన్నదానం కార్యక్రమం నిర్వహించిన బాబా ఫక్రుద్దీన్ ఈ సందర్భంగా శింగనమల గ్రామవాసి జి బాబా ఫక్రుద్దీన్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరము మండల కేంద్రంలో గరిడీ లో గార్ని పండగ సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు మండలంలో చుట్టుపక్కల గ్రామస్తులు భక్తాదులు పెద్ద ఎత్తున ఈ అన్నదాన కార్యక్రమానికి హాజరవుతున్నట్లు తెలిపారు భక్తిశ్రద్ధలతో గ్యాలరీ పండగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నట్లు తెలిపారు

## మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా



అనంతపురం, అక్టోబర్ 15 (అనంత ప్రభ)
నగరంలోని ఆర్ట్స్ కళాశాల ఎదురుగా ప్రత్యేక శిబిరం.. తొలి సంతకం చేసిన అనంత వెంకటరామిరెడ్డి
ఏ నాయకుడి ఆలోచన అయినా ప్రజలకు మేలు చేసేలా ఉంటే దాన్ని విజన్ అంటారు. కానీ దురదృష్టవశాత్తు ముఖ్యమంత్రి చంద్రబాబు విజనరీ పేరుతో ప్రభుత్వ ఆస్తులను ప్రైవేట్‌పరం చేస్తున్నారు.
వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో ప్రజలకు మెరుగైన వైద్యం, వైద్య విద్య అందించాలని భావించి రూ.8 వేల కోట్లతో 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.
వైఎస్ జగన్ హయాంలో కోవిడ్ తర్వాత ఏడు కళాశాలలు పూర్తి చేశారు. వైసీపీ అధికారంలో ఉన్న సమయంలోనే ఐదు మెడికల్ కళాశాలలను అందుబాటులోకి తెచ్చాం.
నిర్మాణాలు పూర్తయినా ఎన్నికల కోడ్‌తో రెండు కళాశాలలు అందుబాటులోకి రాలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రభుత్వ మెడికల్ కళాశాలలను పీపీపీ పేరుతో ప్రైవేటీకరణ చేస్తున్నారు. ఇది పేదలకు వైద్య విద్యను దూరం చేయడమే
లక్షల కోట్ల ఆదాయం వచ్చేలా చంద్రబాబు తన బంధువులు, పార్టీ వాళ్లకు కళాశాలలను హస్తగతం చేయడానికి కుట్ర చేస్తున్నారు.
కూటమి నిర్ణయంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలతో పాటు పేదలకు వైద్య విద్య దూరం అవుతుంది.

## నూతన ట్రైబల్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం, ఆర్ అండ్ బి తారు రోడ్డు ఏర్పాటుకు శిలాఫలకం ఆవిష్కరించి, భూమి పూజలు చేసిన ఎం.పీ. అంబికా లక్ష్మీనారాయణ ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ

శింగనమల, అక్టోబర్ 15 (అనంత ప్రభ)
బుక్కరాయసముద్రం మండల కేంద్రం గ్రామ పంచాయతీలోని దేవరకొండ సమీపంలో నూతన ట్రైబల్ రెసిడెన్షియల్ స్కూల్ మరియు ఆర్ అండ్ బి తారు రోడ్డు ఏర్పాటుకు ఎం.పీ. అంబికా లక్ష్మీనారాయణ ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ శిలాఫలకం ఆవిష్కరించి, భూమి పూజ నిర్వహించారు.
ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం జి.జి.యూ.ఏ. పథకం కింద నూతన గిరిజన గురుకుల పాఠశాల (బాలురు) నిర్మాణం కోసం ₹5.38 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు.
బుక్కరాయసముద్రం నుండి గూగూడు వరకు వయా ఏడావులపర్తి,బి. పప్పూరు రోడ్డుకు 19 కి.మీ. పొడవునా ₹2.50 కోట్లు వెచ్చించి తారు రోడ్డు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.
గురుకుల పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాల ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించిందని తెలిపారు. అందులో భాగంగానే గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో



డొక్కా సీతమ్మ భోజన పథకం కింద నాణ్యమైన ఆహారం అందించడం జరుగుతోందన్నారు.
అంతేకాకుండా సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా కిట్లు విద్యార్థులకు అందజేయబడుతున్నాయని పేర్కొన్నారు.
విద్యాలయాల్లో రాజకీయ రంగులు, గుర్తులు లేకుండా మహనీయుల గురించి విద్యా బోధన, సౌకర్యాల కల్పన జరుగుతోందన్నారు.
దశాబ్దాలుగా బుక్కరాయసముద్రం నుండి గూగూడు వరకు వయా ఏడావులపర్తి,బి. పప్పూరు మీదుగా తగిన రోడ్డు సౌకర్యం లేక ప్రజలు ఇబ్బంది పడ్డారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 18 నెలల్లోనే తారు రోడ్డు మంజూరు కావడం గర్వకారణమని తెలిపారు.
గత వైసీపీ ప్రభుత్వం గుంతలు పూడ్చలేని చేతగాని పరిపాలన సాగించిందని విమర్శించారు.
కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మెగా %ఇూజ% ఫైల్‌పై తొలి సంతకం చేసి, దాదాపు 16 వేల మంది టీచర్ ఉద్యోగాలు భర్తీ చేసింది.
అలాగే 20 లక్షల ఉద్యోగాల కల్పన ధ్యేయంగా వివిధ సంస్థలు, ప్రపంచ స్థాయి కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఒప్పందాలు కుదుర్చుకుంటున్నాయని వివరించారు.
ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు , ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ , విద్యా,ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ కృతజ్ఞతలు తెలిపారు.

AP 4PG 16 10 2025 thursday qxp_Layout 1 16-10-2025 05:48 AM Page 3









## సమ్మర్‌లో ఈ కోల్డ్ కాఫీలతో బరువు తగ్గడం ఖాయం..



కాఫీ.. ఉదయాన్నే ఇది గొంతులో పడనిదే చాలా మందికి చాలా పనులు అవ్వవు. అంతలా దీనికి అడిక్ట్ అయిపోతారు. ఓ రకంగా ఇది స్ట్రెస్ బస్టర్ చాలా మందికి. దీనిని తాగడం వల్ల చాలా లాభాలు ఉన్నాయి. అయితే, ఏదైనా ఎప్పుడు, ఎలా, ఎంత తీసుకోవాలో అలానే చేయాలి. లేకపోతే రిజల్ట్స్ తేడా కొడతాయి. ఇప్పుడు ఈ సమ్మర్‌లో నార్మల్ కాఫీ కాకుండా, వెయిట్ తగ్గించే వెయిట్ లాస్ గురించి తెలుసుకుందాం.

కోల్డ్ కాఫీ..

ఈ కాఫీని కొద్ది మంది ఇష్టపడతారు. అయితే, సమ్మర్‌లో వేడిని తగ్గించి రిఫ్రెష్‌గా ఫీల్ అయ్యేందుకు కాఫీ లవర్స్ నార్మల్ కాఫీ బదులు దీనికి షిఫ్ట్ అవుతారు. దీనిని తాగడం వల్ల ఓ మైనస్ పాయింట్ ఏంటంటే.. ఇది క్యాలరీలను అమాంతం పెంచుతుంది. అయితే, అలా కాకుండా ఈ రుచిని ఆస్వాదిస్తూనే.. బరువు తగ్గాలంటే కొన్ని స్పెషల్ కాఫీల గురించి మీరు తెలుసుకోవాల్సిందే.

కోల్డ్ బ్రూయింగ్..

ఈ కాఫీ గింజలను గది ఉష్ణోగ్రత కంటే తక్కువగా ఉన్న నీటిలో 20 గంటల కంటే ఎక్కువసేపు ఉంచి తయారు చేస్తారు. దీనిని ఇంట్లోనే ఈజీగా ఎలా చేయాలంటే మీరు చేయాల్సిదిల్లా 1:12 నిష్పత్తితో రాత్రి నీటిలో కాఫీ గింజలను ఉంచి వాటిని మిక్సీ పట్టండి. దీనిని మీరు ఓ కేజి వరకూ చేసుకుని ఫ్రిజ్‌లో కూడా పెట్టుకోవచ్చు. దీనిని తీసుకుని కాఫీలా చేసుకుని పాలు లేకుండా. తీపి కోసం షుగర్, బెల్లం పొడి, తేనె వేసుకోవచ్చు. అయితే లేకుండా తాగితే బెటర్. ఒక వేళ తాగలేమనుకుంటే కాస్తా తక్కువ పరిమాణంలో షుగర్ ఆల్టర్నేటివ్స్ వేసి కొద్దిగా నిమ్మరసం వేసుకుని తాగండి. దీని వల్ల బరువు తగ్గుతారు.



దాల్చిన చెక్క కాఫీ..

దాల్చిన చెక్కలో ఎన్నో గుణాలు ఉన్నాయి. అవి బరువుని ఈజీగా తగ్గిస్తాయి. కప్పు బ్లాక్ కాఫీకి ఎస్ప్రెస్సో షాట్, చిటికెడు దాల్చిన చెక్క పొడి కలపండి. దీని వల్ల ఫ్యాట్‌ని కరిగించే కాఫీని తయారు చేసుకోవచ్చు. దీని వల్ల మెటబాలిజం పెరుగుతుంది. దాల్చిన చెక్కలోని యాంటీ ఆక్సిడెట్స్ కెఫిన్‌తో కలిసి బరువు తగ్గించడాన్ని స్పీడ్‌గా చేస్తుంది.



## వేసవిలో రాగి జావ తాగితే ఎనర్జీతో పాటు ఆరోగ్యం కూడా



వేసవికాలంలో త్వరగా నీరసించిపోతారు. ఎండలో కాసేపు అలా వెళ్లివచ్చారంటే ఎనర్జీ అంతా కోల్పోయి నీరసంగా మారిపోతారు. అలాగే ఎండాకాలంలో ఏమీ తినాలనిపించదు. ఎక్కువగా దాహం వేస్తూ ఉంటుంది. అలా అని ఏదీ తినకుండా ఉంటే త్వరగా నీరసించిపోతాం. ఎండాకాలంలో డీహైడ్రేషన్ కు గురికావడం, వడదెబ్బ బారిన పడటం ఎక్కువగా జరుగుతుంది. వేసవికాలంలో ఉదయం తీసుకునే ఆహారం రోజంతా హుషారుగా పని చేయడానికి కావాల్సిన శక్తిని అందించేలా ఉండాలి. అందుకే వేసవి కాలంలో రాగి జావ తాగాలని న్యూట్రిషనిస్టులు సూచిస్తుంటారు.దీని వల్ల తక్షణ శక్తి రావడంతో పాటు, రోగనిరోధక శక్తి మెరుగుపడటం, శరీరానికి కావాల్సిన పోషకాలను అందిస్తుంది.

కాల్షియం సమృద్ధిగా ఉంటుంది: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ స్టడీస్ ప్రకారం, ఇతర మిల్లెట్లు ధాన్యాలతో పోలిస్తే రాగుల్లో కాల్షియం ఎక్కువగా ఉంటుంది. పాలు కాకుండా కాల్షియం ఎక్కువగా ఉండేది రాగుల్లోనే. డయాబెటిస్ నియంత్రణలో సహాయపడుతుంది: గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉండటం వల్ల ఆకలి తక్కువగా వేస్తుంది. జీర్ణక్రియ వేగాన్ని మెయింటైన్ చేస్తుంది. రక్తంలో చక్కెర పరిధిని నియంత్రణలో ఉంచుంతుంది. రక్తహీనతతో పోరు: రాగుల్లో ఐరన్ పుష్కలంగా ఉంటుంది. రక్తహీనత ఉన్న వారు, తక్కువ హిమోగ్లోబిన్ స్థాయిలు ఉన్న వారికి రాగి జావ ఒక వరం లాంటిది. ఇందులోని ఐరన్ రక్తహీనతను తగ్గిస్తుంది.

బరువు తగ్గడంలో సహాయం: రాగుల్లో అధిక మొత్తంలో ఉండే డైటరీ ఫైబర్ పొట్టను ఎక్కువసేపు నిండుగా ఉంచుతుంది. దీని వల్ల ఆకలి తగ్గుతుంది. ఇలా బరువు తగ్గడానికి దారితీస్తుంది. చర్మం సంరక్షణ: రాగుల్లో ఉండే మెథియోనిన్, లైసిన్ వంటి కీలక అమైనో ఆమ్లాలు చర్మ కణజాలాన్ని కాపాడతాయి. చర్మం ముడతలు పడకుండా చూస్తాయి. శరీరాన్ని రిలాక్స్ చేస్తుంది: ఆందోళన, డిప్రెషన్, నిద్రలేమితో బాధపడుతున్న వారు క్రమం తప్పకుండా రాగులు తీసుకుంటే మంచి ఫలితం ఉంటుందని మెడ్ ఇండియా 2000లో నిర్వహించిన అధ్యయనం పేర్కొంది. గ్లూటెన్ ఉండదు: గోధుమలతో పోలిస్తే రాగులు చాలా సులభంగా జీర్ణమవుతాయి. ఇందులో గ్లూటెన్ ఉండదు. ఇది శరీరంలో మరింత ఆల్కలీన్ మీడియంను సృష్టిస్తుంది.

రాగి జావ తయారీ విధానం: ౹ రాగి పిండిని ముందుగా కొన్ని నీళ్లలో వేసి ఉండలు లేకుండా కలుపుకోవాలి. ౹ మరో గిన్నె తీసుకుని అందులో నీళ్లు పోసి స్టవ్ పై పెట్టుకోవాలి. ౹ నీళ్లు మరిగేటప్పుడు ముందుగా నీటిలో ఉండలు లేకుండా కలిపి పెట్టుకున్న రాగి పిండిని ఈ నీటిలో వేసుకోవాలి. ౹ తగినంత ఉప్పు, తగినంత మజ్జిగ వేసుకోవాలి. ౹ ఆ మిశ్రమం దగ్గరికి వచ్చేంత వరకు కలుపుతూ ఉండాలి. ౹ తర్వాత స్టవ్ పై నుండి దించి చల్లార్చుకోవాలి. ౹ కొత్తిమీర, పుదీనా వేసుకుంటే రాగి జావ సిద్ధమైనట్లే. ౹ కొద్దిగా కారంగా కావాలనుకుంటే కారం వేసుకుని రాగి జావను తాగొచ్చు.

## వడదెబ్బ తగిలిన వెంటనే చేయాల్సిన ప్రథమ చికిత్స ఇదే

అధిక వేడిని శరీరం తట్టుకోలేక వడదెబ్బ బారిన పడుతుంది. శరీరంలో ఎలక్ట్రోలైట్స్ తగ్గి, డీహైడ్రేషన్ బారిన పడడం వల్ల వడదెబ్బ కలుగుతుంది. బయట ఉష్ణోగ్రతలు పెరుగుతున్నప్పుడు శరీరం తనలోని వేడిని నియంత్రించుకోలేక విఫలమవుతుంది. అలాంటి సమయంలోనే వడదెబ్బలాంటి ప్రాణాపాయ పరిస్థితులు ఏర్పడతాయి. వెంటనే ప్రథమ చికిత్స చేస్తే వారిని ప్రాణాపాయ పరిస్థితి నుంచి కాపాడుకోవచ్చు.

వడదెబ్బ లక్షణాలు

వడదెబ్బ తగిలిన వెంటనే శరీర ఉష్ణోగ్రత పెరిగిపోతుంది. ఒక్కోసారి 104శీ ఫారెన్ హీట్ దాటుతుంది. అపస్మారక స్థితిలోకి చేరుకుంటారు. గుండె వేగంగా కొట్టుకోవడం, శ్వాస వేగంగా లేదా తక్కువగా తీసుకోవడ, రక్తపోటు పెరగడం లేదా తగ్గడం, చెమట పట్టకపోవడం, వికారం, వాంతులు కావడం, స్పృహ కోల్పోవడం వంటివన్నీ జరుగుతాయి. వడదెబ్బ తగిలిన వెంటనే ప్రాథమిక చికిత్సను అందిస్తే వారిని కాపాడుకోవచ్చు.


ప్రథమ చికిత్స ఇలా...

వడదెబ్బ తగిలిన రోగిని చల్లని నీటిలో ముంచిన వస్త్రంతో తుడవాలి. అలా శరీరం అంతా తుడుస్తూ ఉండడం వల్ల శరీర ఉష్ణోగ్రత తగ్గుతూ ఉంటుంది. శరీర ఉష్ణోగ్రత 101 డిగ్రీలు వచ్చే వరకు అలా చల్లని నీటితో వస్త్రంతో తుడుస్తూ ఉండాలి. చల్లని పానీయాలను అందించాలి. ఎటువంటి మందులు ఇవ్వకూడదు. గాలి తగిలేచోట ఉంచాలి. ఉప్పు కలిపిన మజ్జిగ లేదా గ్లూకోజ్ వాటర్ లో కాస్త ఉప్పు కలిపి తాగించడం మంచిది. ఓఆర్ఎస్ అందుబాటులో ఉంటే దాన్ని తాగిస్తే ఎంతో మేలు. ఈ పనులు చేస్తూనే మరోపక్క ఆసుపత్రికి తీసుకెళ్లే ఏర్పాట్లు కూడా చేయాలి. ఎందుకంటే కొంతమందిలో వడదెబ్బ తీవ్రంగా కొడితే ప్రాణానికే ప్రమాదం కావచ్చు.

ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

ఎండలు పెరిగిపోతున్న ఈ కాలంలో వడదెబ్బ కొట్టకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవడం మంచిది. బయట ఉష్ణోగ్రత అధికంగా ఉన్న సమయంలో ఎక్కువసేపు ఎండకు గురవ్వకపోవడమే మంచిది. బయటికి వెళ్లే ముందు చల్లని పానీయాలు తాగి వెళ్లాలి. కాఫీ, టీలకు దూరంగా ఉండాలి. మద్యాన్ని పూర్తిగా మానేయాలి. లేత రంగులో ఉండే వస్త్రాలు ధరించాలి. అవి వదులుగా ఉండేలా చూసుకోవాలి. ఎండలో బయటికి వెళ్లినప్పుడు వాటర్ బాటిల్ దగ్గర ఉంచుకోవడం అన్ని విధాలా మంచిది.

ఎండలు పెరుగుతున్నప్పటినుంచి రోజూ మజ్జిగ తాగడం అలవాటు చేసుకోవాలి. వడదెబ్బను తట్టుకునే శక్తిని పానీయాలు అందిస్తాయి. చల్లని పానీయాలు, మజ్జిగ తాగడం వల్ల శరీరంలో ఎలక్ట్రోలైట్స్ పడిపోకుండా ఉంటాయి. వేసవిలో ఆహారపు అలవాట్లను కూడా మార్చుకోవడం మంచిది. దాహాన్ని పెంచేసే మాంసాహారాన్ని, మసాలా నిండిన ఫుడ్‌కు, స్పైసీ ఫుడ్‌కు దూరంగా ఉండటం మంచిది.



## డస్ట్ అలర్జీ ఉందా.. ఇంటిని ఇలా క్లీన్ చేయండి..

అలర్జీ.. చాలా సమస్యలకి ఈ చిన్న సమస్య కారణం. దీని వల్ల ఎన్నో ఇబ్బందులు ఎదురవుతాయి. ఇంట్లోని చిన్న దుమ్ము వల్ల ఈ సమస్య ఎక్కువగా వస్తుంది. అలాంటప్పుడు ప్రతి మూలని చక్కగా క్లీన్ చేయడం అనేది చాలా ముఖ్యం. కానీ, మనం అలా చేయలేం. ఎలా క్లీన్ చేయాలో తెలియదు. అలాంటివారికి ఓ అవగాహన కోసమే ఈ టిప్స్.

**ఇంట్లోని క్రిములే కారణం..**

ఆస్తమా, ఇతర బ్రీథింగ్ ప్రాబ్లమ్స్ రావడానికి ఇంట్లోని దుమ్ము కారకాలు ముఖ్య కారణం. వీటిని తొలగిస్తే చాలా వరకూ సమస్యలు దూరమవుతాయి. అందుకే ఎప్పటికప్పుడు ఇంటిని క్లీన్ చేస్తుండాలి. ఎంత క్లీన్ చేసినా, చేసే టైమ్‌లో, చేశాక కూడా కొన్ని క్రిముల వల్ల చాలా సమస్యలు వస్తాయి. అలాంటి వారు కొన్ని టిప్స్ పాటించడం మంచిది.

**మాస్క్..**

ఇల్లు క్లీన్ చేసేటప్పుడు మాస్క్ వాడాలి. ముఖ్యంగా అలర్జీ వంటి సమస్యలు ఉన్నవారు డిస్పోజబుల్, ఉతికిన మాస్క్‌లను వాడండి. ఇవి కూడా స్కిన్ ఫ్రెండ్లీగా ఉండాలి. చర్మానికి ఇబ్బంది పెట్టకుండాలి. కాటన్ మాస్క్‌లు వాడండి.

**క్లీన్ చేశాక..**

చాలా మంది మైక్రోఫైబర్ క్లాత్స్, కాటన్ టవల్స్‌తో ఇంటిని క్లీన్ చేస్తుంటారు. వీటితో క్లీన్ చేశాక చక్కగా వాటిని నీటితో ఉతకడం మంచిది. మాప్స్ హెడ్స్ క్లీన్ చేయాలి. ఎప్పటికప్పుడు మాప్ హెడ్స్ క్లీన్ చేయడం మంచిది.

**డిస్పోజబుల్ మంచివి..**

సింథటిక్ డస్టింగ్ వైప్స్ వంటి వాటికి దుమ్ము త్వరగా ఆకర్షిస్తాయి. అందుకే వీటిని వాడాక మళ్ళీ వాడకపోవడమే మంచిది. ఇవి తక్కువ ధరకే లభించడమే కాకుండా క్రిములని కూడా దూరం చేస్తాయి. కాబట్టి వీటిని వాడడం చాలా మంచిది.



**క్లీనర్స్..**

చాలా మంది క్లీనింగ్ కోసం డిటర్జెంట్స్, స్టెయిన్ రిమూవల్ ప్రోడక్ట్స్ తీసుకుంటారు. అయితే, వాటిని వాడే ముందు లేబుల్స్ చేయడం మంచిది. ఇవి కూడా సువాసన లేనివి ప్లేన్‌వి తీసుకోవడం మంచిది. వైట్ వెనిగర్, బేకింగ్ సోడాతో కూడా క్లీన్ చేయొచ్చు. వీటిలో చక్కగా నిమ్మరసం కలిపి క్లీన్ చేయండి.

**వారానికి ఓసారి దుప్పట్లు..**

చాలా మంది పడక బట్టల్ని అంతగా పట్టించుకోరు. కానీ, ఎక్కువగా అలర్జీ కారక క్రిములు వీటిపైనే ఉంటాయి. కాబట్టి, వీటిని కచ్చితంగా వారానికి ఓసారైనా క్లీన్ చేయాలి. క్లీన్ చేశాక కచ్చితంగా ఎండలో ఆరబెట్టాలి.

## కళ్లు బాగా కనిపించాలంటే.. ఇవి కచ్చితంగా తినాలి..!



మన శరీరంలోని జ్ఞానేంద్రియాల్లో అతి ముఖ్యమైనవి కళ్లు. కళ్లు సరిగ్గా పనిచేయకపోతే.. ఏ పని సరిగ్గా చేయలేం. చదవడానికి, రాయడానికి, సాధారణ పనులు చేయడానికీ కష్టంగా మారుతుంది. ప్రస్తుతం ఉన్న వాతావరణ పరిస్థితులు, కాలుష్యం, ఆహారపు అలవాట్లు, లైఫ్‌స్టైల్, మొబైల్ ఫోన్ల వాడకం కారణంగా.. దృష్టి సమస్యలతో భాదపడేవారి సంఖ్య రోజు-రోజుకూ ఎక్కువవుతోంది. దృష్టి సమస్యలతో బాధపడేవారు, కంటి చూపును రక్షించుకోవాలనుకునేవారు.. వారి డైట్ ఏ పోషకాలు చేర్చుకోవాలో ఈ స్టోరీలో చూద్దాం

లుటిన్, జియాక్సంతిన్..


లుటిన్, జియాక్సంతిన్ మన కంటిలో ఉండే.. కెరోటినాయిడ్లు. ఇవి సూర్యరశ్మి నుంచి కంటిని రక్షిస్తాయి. ఇవి లైట్ ఫిల్టర్‌గా పనిచేస్తాయి, యూవీ కిరణాల వల్ల కంటి కణజాలాలు దెబ్బతినకుండా కాపాడతాయి. అరోగ్యకరమైన కంటి కణాలకు హాని చేసే ఫ్రీ రాడికల్స్, అన్‌స్టేబుల్ మాలిక్యూల్స్ నుంచి జియాక్సంతిన్ రక్షిస్తుంది. లుటిన్ జియాక్సంతిన్ పొందడానికి.. మీ డైట్‌లో ముదరు ఆకుపచ్చ కూరలు, గుడ్లు, పసుపు, ఆరెంజ్ రంగు పండ్లు, బ్రోకలీ, మొక్కజొన్న, బఠానీ, కాలే వంటి ఆహార పదార్థాలు తీసుకోండి.
విటమిన్ సి ని ఆస్కార్బిక్ యాసిడ్ అని కూడా అంటారు. విటమిన్ సి ఆక్సిజన్ తీసుకోవడం, కంటి లోపల ఆక్సిజన్ తక్కువ స్థాయిని నిర్వహించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. లెన్స్, విట్రస్‌లో ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించడానికి, కంటి శుక్లాలం ప్రమాదాన్ని తగ్గించడానికి విటమిన్ సి సహాయపడుతుంది. విటిమిన్ సి అధికంగా ఉండే... కివి, క్యాప్సికమ్, టమాటా, బ్రోకలీ, పాలకూర, జామ కాయ, సిట్రస్ పండ్లు, ద్రాక్ష పండ్లు మీ ఆహారంలో చేర్చుకోండి.

AP 4PG 16 10 2025 thursday qxp_Layout 1 16-10-2025 05:48 AM Page 4



# 250 ఏళ్ల కంపెనీకి బ్రాండ్ అంబాసిడర్‌గా శ్రీలీల.. రెమ్యునరేషన్ ఎన్ని కోట్లంటే?





కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన మైసూర్ శాండల్ సోప్‌కు స్టార్ హీరోయిన్ తమన్నా భాటియాను బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించడంపై కన్నడ సీమ రగిలిపోతోన్న సంగతి తెలిసిందే. దాదాపు 6.2 కోట్ల పారితోషికంతో తమన్నాకు ఈ బాధ్యతను కట్టబెట్టింది సిద్ధరామయ్య ప్రభుత్వం. అయితే కర్ణాటకలో ఎంతో మంది ప్రముఖులు, ప్రతిభావంతులు ఉండగా పరాయి రాష్ట్రానికి చెందిన నటిని మైసూర్ శాండల్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించడం వివాదానికి దారి తీసింది. కర్ణాటక సంఘాలు, పార్టీలు, ప్రముఖులు ప్రభుత్వ తీరును తప్పుబడుతున్నారు. ఈ క్రమంలో కర్ణాటకకి చెందిన యువ కథానాయిక శ్రీలీల అదిరిపోయే ఆఫర్ అందుకున్నారు. ఈ వివరాల్లోకి వెళితే..

చేతినిండా సినిమాలతో శ్రీలీల బిజీ ప్రస్తుతం టాలీవుడ్‌లో బిజీగా ఉన్న హీరోయిన్ ఎవరంటే ఖచ్చితంగా వినిపించే పేరు శ్రీలీల. ధమాకాతో లైమ్ లైట్‌లోకి వచ్చిన ఈ ముద్దుగుమ్మ ఆ తర్వాత భగవంత్ కేసరి, గుంటూరు కారం వంటి భారీ బడ్జెట్ సినిమాల్లో అవకాశాలు దక్కించుకుంది. ఇక పుష్ప 2లో కిస్సిక్ సాంగ్‌తో దేశాన్ని ఊపేసి నేషనల్ వైడ్ పాపులర్ అయ్యింది. అందం, అభినయం, డ్యాన్స్‌తో క్రేజీ ఆఫర్లు పట్టేస్తోంది. చాలా చిన్న వయసులోనే బాలీవుడ్ ఆఫర్ కూడా అందుకోవడంతో శ్రీలీల అదృష్టంపై సీనియర్ హీరోయిన్లు, అప్ కమింగ్ హీరోయిన్లు అసూయ పడుతున్నారు. ఏళ్లుగా నిరీక్షిస్తున్న తమ వల్ల కానిది శ్రీలీల ఈజీగా సాధిస్తోందని కుళ్లుకుంటున్నారు.

ఆషికి 3తో బాలీవుడ్‌లోకి బాలీవుడ్ స్టార్ హీరో కార్తీక్ ఆర్యన్ సరసన ఆషికి 3 అనే సినిమా ద్వారా బాలీవుడ్‌లో అడుగుపెడుతున్నారు శ్రీలీల. అనురాగ్ బసు ఈ చిత్రానికి దర్శకుడు. దీపావళి కానుకగా ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ భావిస్తున్నారు. దీనిలో భాగంగా శరవేగంగా సినిమాను పరుగులు పెట్టిస్తున్నాడు అనురాగ్. అయితే అషికి 3 ఇంకా సెట్స్ మీద ఉండగానే శ్రీలీల హిందీలో మరో ఆఫర్ అందుకున్నట్లుగా వార్తలు వస్తున్నాయి. మరో స్టార్ హీరో సిద్ధార్థ్ మల్హోత్రా సరసన శ్రీలీల ఆడిపడనుందట. ఆనంద్ ఎల్ రాయ్ ఈ సినిమాను నిర్మిస్తుండగా.. రాజ్ సాండియాలా దర్శకత్వం వహిస్తారని బీటౌన్ టాక్. అయితే దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ఇక తెలుగులో జూనియర్, మాస్ జాతర, లెనిన్, తమిళంలో పరాశక్తి సినిమాలలో శ్రీలీల నటిస్తున్నారు.

టాప్ బ్రాండ్స్‌కు అంబాసిడర్‌గా సినిమా హిట్, ఫ్లాపులతో సంబంధం లేకుండా శ్రీలీల వరుస అవకాశాలు అందుకుంటున్నారు. ఇక బ్రాండ్ అండార్స్‌మెంట్స్‌తోనూ ఈ ముద్దుగుమ్మ భారీగా సంపాదిస్తోందట. న్యాడ్ స్కిన్ కేర్, అమృత గ్రూప్, ప్రెస్టా వుమెన్స్ వేర్, నీరూస్ తదితర బ్రాండ్స్‌కు శ్రీలీల అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్నారు. తాజాగా శ్రీలీల అండార్స్‌మెంట్స్ కెరీర్‌లోనే మైల్ స్టోన్ అనదగ్గ ఆఫర్ వచ్చింది.

శ్రీలీలతో యూకే కంపెనీ డీల్ పర్సనల్ కేర్, కాస్మోటిక్స్, ఫ్రాగ్‌రెన్సెస్ విభాగంలో ప్రపంచంలోని అగ్రగామి సంస్థల్లో ఒకటైన యార్డ్లే లండన్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంపికయ్యారు. లండన్ కేంద్రంగా పనిచేస్తున్న ఈ కంపెనీకి దాదాపు 255 ఏళ్ల చరిత్ర ఉండగా.. ప్రపంచంలోని అత్యంత పురాతన కంపెనీల్లో ఒకటిగా యార్డ్లేకు పేరుంది. 2009లో యార్డ్లేను భారత కార్పోరేట్ దిగ్గజం విప్రో ఎంటర్‌ప్రైజెస్ కొనుగోలు చేసింది. ఇంతటి చరిత్ర కలిగిన ఈ సంస్థలోని ఫ్రాగ్‌రెన్సెస్ విభాగానికి గాను భారత్‌లో శ్రీలీల ప్రమోట్ చేయనుండటం విశేషం.

పారితోషికం ఎంతంటే? అయితే ఇందుకు గాను శ్రీలీల ఎంత మొత్తంలో పారితోషికం అందుకుంటున్నారన్నది తెలియరాలేదు. ప్రస్తుతం బ్రాండ్ ప్రమోషనింగ్ కోసం రూ.50 లక్షల నుంచి రూ.75 లక్షల మధ్య శ్రీలీల ఛార్జ్ చేస్తుండటంతో ఇది కూడా అదే స్థాయిలో లేదా ఆపైనా ఉండే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. యార్డ్లే నుంచి శ్రీలీల పారితోషికంగా ఎంత మొత్తం వసూలు చేస్తున్నారనే దానిపై త్వరలోనే మరిన్ని వివరాలు తెలిసే అవకాశం ఉంది.




# చిరంజీవికి అలా.. బాలయ్యకు ఇలానా? అల్లు అరవింద్‌నే అడగండి..



మెగా ఫ్యామిలీ, అల్లు కుటుంబానికి మధ్య విభేదాలు తారాస్థాయికి చేరుకొన్నాయనే విషయాల గురించి మీడియాలో ఎక్కువగా చర్చ జరుగుతున్నది. ఈ రెండు కుటుంబాలు నర్మగర్భంగా మాట్లాడే తీరు ఆ వివాదాస్పద అంశానికి బలం చేకూరేలా కనిపిస్తుంటుంది. అయితే సాధారణ ప్రజలకు ఆ కుటుంబాల మధ్య గతంలో ఉన్న సఖ్యత, బంధాలు లేవనే అపోహ మాత్రం ఏర్పడింది. అయితే ఈ విషయాలపై రెండు కుటుంబాలకు ఆప్తుడైన తండేల్ నిర్మాత బన్నీ వాసు వెల్లడించిన వివరాల్లోకి వెళితే..

ఇటీవల కాలంలో అల్లు ఫ్యామిలీకి నందమూరి బాలకృష్ణ అత్యంత చేరువైనట్టు బయట వాళ్లకే కాకుండా సినిమా వర్గాలకు అనిపిస్తుంది. అయితే ఈ క్రమంలో బాలయ్యకు పద్మభూషణ్ అవార్డు రావడంపై అన్ని వర్గాల నుంచి స్పందన వ్యక్తమైంది. అయితే సినీ పరిశ్రమ ఈ సందర్భాన్ని పురస్కరించుకొని భారీ సమావేశాన్ని ఏర్పాటు చేసి.. ఆయనకు సన్మానం చేయాలనే ఆలోచనలో సినిమా పరిశ్రమ ఉందనే వార్త ఫిలిం నగర్‌లో చక్కర్లు కొడుతున్నది.

అయితే బన్నీ వాసును ఈ విషయంపై మెగాస్టార్ చిరంజీవికి పద్మభూషణ్ వస్తే ఎలాంటి సన్మానం చేయలేదు. మెగా హీరోలు, మెగా కుటుంబం పెద్దది అనే ఫీలింగ్ ఇండస్ట్రీలో ఉంది. ఆ సన్మాన కార్యక్రమాన్ని ఎందుకు నిర్వహించలేదని మీడియా అడిగిన ఓ ప్రశ్నకు ఆయన సరైన రీతిలో స్పందించారు.

పద్మ భూషణ్ అవార్డు అందుకొన్నందుకు చిరంజీవికి సన్మానం చేయకపోవడం.. బాలకృష్ణకు చేయాలనే ప్లాన్ చేయడం లాంటి విషయాలను అరవింద్ గారి లాంటి పెద్ద వాళ్లను అడిగితే బాగుంటుంది. అది చాలా పెద్ద విషయం. నా వయసుకు, నా స్థాయికి మాట్లాడే విషయం కాదు. అరవింద్ గారినే అడిగితే మంచింది. ఈ పరిస్థితుల్లో నేను ఏం మాట్లాడినా బాగుండదు. ఆ విషయం గురించి నేను మాట్లాడితే కరెక్ట్ కాదు అంటూ బన్నీ వాసు తప్పించుకొన్నారు.

నంద్యాల వివాదం తర్వాత నాకు, పవన్ కల్యాణ్‌కు మధ్య గ్యాప్ వచ్చిందనే విషయం సరికాదు. అందులో వాస్తవం లేదు. పవన్ కల్యాణ్ మెచ్యూరిటీ లెవెల్స్ వేరేగా ఉంటాయి. ఆయన ఇలాంటి విషయాలను మనసులో పెట్టుకోని చూడరు. ఎవరు ఏం చేస్తున్నారు? ఎవరు ఎలాంటి వారు? అనేది ఆయనకు ఫుల్లుగా క్లారిటీ ఉంది. నా విషయంలో ఆయన బన్నీతో కలిపి చూడరు. పార్టీకి ఏం చేస్తున్నాను? పార్టీ కోసం ఎలా ఉంటున్నారనేది ఆయన చూస్తారు అని బన్నీ వాసు వివరణ ఇచ్చారు.

# మహేష్ బాబు వదిలేసిన 1800 కోట్ల సినిమా.. థియేటర్లు బద్దలయ్యేవి.. ఆ మూవీ ఏంటంటే?





సూపర్ స్టార్ మహేష్ బాబు ప్రస్తుతం ఇండియాస్ బిగ్గెస్ట్ డైరెక్టర్ ఎస్ఎస్ రాజమౌళి దర్శకత్వంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం హైదరాబాద్ లోనే మూడవ షెడ్యూల్ జరుగుతోంది. చిత్రీకరణ విషయంలో మాత్రం జక్కన్న ఎస్. ఎస్. ఎం.బి 29 సినిమాను శరవేగంగా కొనసాగిస్తున్నారు. బాలీవుడ్ స్టార్ బ్యూటీ ప్రియాంక చోప్రా హీరోయిన్ గా నటిస్తున్న విషయం తెలిసిందే. మలయాళం సూపర్ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలో నటిస్తున్నారని తెలుస్తోంది. ఇదిలా ఉంటే మహేష్ బాబు చివరిగా గుంటూరు కారం చిత్రంతో ప్రేక్షకులను అలరించిన సంగతి తెలిసిందే. అది సూపర్ స్టార్ మహేష్ బాబు ఇప్పటివరకు రెగ్యులర్ క్యారెక్టర్లలోనే నటిస్తూ వచ్చారు. కానీ అభిమానులు మాత్రం ఆయనను పవర్ఫుల్ రోల్స్ లో చూడాలని ఎంతగానో ఆశిస్తున్నారు. ఈ క్రమంలోనే మహేష్ బాబు వదిలేసుకున్న 1870 కోట్ల సినిమా గురించి తాజాగా న్యూస్ బయటకు వచ్చింది. ఆ సినిమా చేసి ఉంటే మాత్రం మహేష్ బాబు ఇండియా ను షేక్ చేసే వారిని సినీ ప్రముఖులు అభిప్రాయపడుతున్నారు.

ఇంతకీ ఆ సినిమా ఏంటో తెలిస్తే అందరూ షాక్ అవ్వాల్సిందే. క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కాంబినేషన్లో వచ్చిన పుష్ప చిత్రమే కావడం విశేషం. అయితే ఈ సినిమాకు మొదట హీరోగా మహేష్ బాబు అని అనుకున్నట్టుగా ఇప్పుడు తెలుస్తోంది. కానీ మహేష్ బాబు ఆ సినిమాలు వదులుకోవడంతో అల్లు అర్జున్ వద్దకు వెళ్లిందని ఫిల్మ్ సర్కిల్స్ లో గుసగుసలు నడుస్తున్నాయి. ఇక అల్లు అర్జున్ టెర్రిఫిక్ పెర్ఫార్మెన్స్ తో పుష్ప, పుష్ప 2 చిత్రాలు ఎంతటి సెన్సేషన్ క్రియేట్ చేశాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు.

రీసెంట్ గా వచ్చిన పుష్ప 2 చిత్రం ఏకంగా బాక్సాఫీస్ రికార్డులను తిరగరాసింది. 1870 కోట్లు గ్రాస్ కలెక్ట్ చేసి ఇండియాలోనే హైయెస్ట్ గ్రాస్ కలెక్ట్ చేసిన రెండవ సినిమాగా రికార్డు సెట్ చేసింది. బాహుబలి 2 సాధించిన బాక్సాఫీస్ కలెక్షన్లు 1810 కోట్లను దాటేసి మరి ఈ రికార్డును సెట్ చేయడం సెన్సేషన్ గా మారింది. మన వైపు అల్లు అర్జున్ కు పుష్ప పాత్రలో నటించినందుకు ఏకంగా బెస్ట్ యాక్టర్ విభాగంలో నేషనల్ అవార్డు వరించిన సంగతి తెలిసిందే. ఇక నెక్స్ట్ పుష్ప 3 కూడా రాబోతుంది. ఆ పార్ట్ లో విజయ్ దేవరకొండ నటిస్తారని తెలుస్తోంది.

అయితే ఇంతటి సెన్సేషన్ క్రియేట్ చేసిన పుష్ప చిత్రాన్ని మహేష్ బాబు ఎందుకు వదులుకున్నారా అన్నది ఇప్పుడు మిలియన్ డాలర్ క్వశ్చన్ గా మారింది. అయితే పుష్ప చిత్రం ప్రారంభానికి ముందు మహేష్ బాబు ఇంట్లో వరుసగా విషాదాలు నెలకొనడం, గుంటూరు కారం చిత్రం తర్వాత ఎస్ఎస్ రాజమౌళి తో సినిమాకు కమిట్ అవ్వడమే కారణం అని తెలుస్తుంది. ఇక పుష్ప చిత్రమే కాదు, శంభాజీ మహారాజ్ జీవిత కథతో వచ్చిన చావా చిత్రాన్ని కూడా మహేష్ బాబు వదిలేసారంట. ఈ హిస్టారికల్ ఫిలిం లో మహేష్ బాబు నటించిన మాత్రం మరింత బీభత్సం సృష్టించే వారిని ఫ్యాన్స్ అభిప్రాయపడ్డారు. ఇలా తన ముందుకు వచ్చిన రెండు బ్లాక్ బస్టర్ మూవీస్ ను మహేష్ బాబు వదులుకోవడం ఆసక్తికరంగా మారింది. ఎస్. ఎస్. ఎం.బి 29 తో మాత్రం ఇండియన్ బాక్సాఫీస్ రికార్డులను చెల్లాచెదురు చేస్తారని ఫ్యాన్స్ నమ్ముతున్నారు. ఆ ప్రాజెక్టుకు మార్కెట్లోనూ భారీ డిమాండ్ ఉండింది.

# భైరవం మూవీ రివ్యూ అండ్ రేటింగ్

వీపురంలో జమీందార్ వంశానికి చెందిన గజపతి (మనోజ్ మంచు)కి గ్రామంలో పేరు ప్రతిష్టలు ఉన్నప్పటికీ.. పేదరికం వెంటాడుతుంటుంది. గజపతికి తన ఊరిలోనే పెద్దరికాన్ని ప్రదర్శించే వరద (నారా రోహిత్), అనాథగా బతికే శ్రీను (బెల్లంకొండ శ్రీను) ప్రాణస్నేహితులుగా ఉంటారు. ఇదిలా ఉండగా, ఆ గ్రామంలోని ఆలయ ధర్మకర్తగా గజపతి నానమ్మ (జయసుధ) ఉంటారు. ఆలయ భూములు కాజేయడానికి మంత్రి (శరత్ లోహితస్య) పన్నాగం పన్నుతాడు.

అనాథ అయినప్పటికీ శ్రీనును కన్నబిడ్డగా ప్రజలు ఎందుకు చూస్తారు? శ్రీనుతో వెన్నెల (అదితి శంకర) లవ్ ట్రాక్ ఎలా సాగింది? గజపతిని భార్య నీలిమ (ఆనంది) ఎలా వేధించింది. భార్య ఒత్తిళ్లకు గజపతి తన మనసును ఎలా మార్చుకొన్నాడు. ప్రాణస్నేహితులుగా ఉండే గజపతి, వరద, శ్రీను మధ్య మంత్రి ఎలా చిచ్చు పెట్టారు. వరద స్నేహం కోసం ప్రాణాలిచ్చేంత ప్రేమ ఉన్న గజపతి తన స్నేహితులకు ఎందుకు ఎదురు తిరిగాడు? వరద, గజపతి, శ్రీను మధ్య విభేదాలు ఎలాంటి పరిస్థితులకు దారి తీశాయి? అనే ప్రశ్నలకు సమాధానమే భైరవం సినిమా కథ.

పోలీస్ ఇన్స్‌పెక్టర్ (సంపత్ రాజ్) తన ఉద్యోగానికి రాజీనామాను పై అధికారికి సమర్పించడంతో సినిమా హై నోట్‌లో మొదలవుతుంది. తన రాజీనామాకు కారణం చెప్పడం మొదలు పెట్టడంతో దేవీ పురంలో ముగ్గురు ప్రాణ స్నేహితుల కథను ఎమోషనల్‌గా దర్శకుడు ప్రారంభించాడు. ముగ్గురు హీరోల ఇంట్రడక్షన్, ఎలివేషన్స్‌ను బాగానే డిజైన్ చేశాడు. ఆ తర్వాత శ్రీను ప్రేమ కథ, వరద, గజపతి ఫ్యామిలీ మధ్య ఉండే అన్యోన్యతను, కథను ఎస్టాబ్లిష్ చేయడానికి కాస్త టైమ్ ఎక్కువగా తీసుకొన్నట్టు అనిపిస్తుంది. ఫస్టాఫ్‌ను రెగ్యులర్, రొటీన్ ఫార్మాట్‌తో నడిపించినప్పటికీ.. ఇంటర్వెల్ ముందు పవర్‌ఫుల్ ఎపిసోడ్‌తో తొలిభాగాన్ని ముగించి సెకండాఫ్‌పై ఆసక్తిని పెంచాడు.

అయితే ముగ్గురు హీరోల మధ్య ఎమోషన్స్, బాండింగ్‌ను బలంగా ఎస్టాబ్లిష్ చేయాల్సి ఉన్నప్పటికీ.. ఆ దిశగా ప్రయత్నం సరిగా చేయలేదనే ఫీలింగ్ కలుగుతుంది. భావోద్వేగంతో చెప్పాల్సిన సన్నివేశాల్లో యాక్షన్ నింపడం వల్ల సినిమాలో సోల్ కాస్త మిస్ అయిందనిపిస్తుంది. ఇలాంటి లోపాలు ఉన్నప్పటికీ.. మామిడితోట సీన్ నుంచి మూవీలో సన్నివేశాలు నెక్స్ట్ రేంజ్‌లోకి వెళ్తాయి. క్లైమాక్స్ సన్నివేశాలను చిత్రీకరించిన తీరు విజయ్ కనకమేడల ప్రతిభ ఎంతో తెలుస్తుంది. సెకండాఫ్‌ను ఇంకాస్త బెటర్‌గా డిజైన్ చేయాల్సిందనే ఫీలింగ్ కలుగుతుంది. నటీనటుల ఫెర్ఫార్మెన్స్ విషయానికి వస్తే.. బెల్లంకొండ శ్రీనివాస్ ఈ సినిమాకు బ్యాక్ బోన్‌గా నిలిచాడు. సినిమాలోని ఎమోషనల్ కంటెంట్‌ను తన పాత్ర ద్వారా బాగా ఎలివేట్ చేశాడు. నటుడిగా మరింత మెచ్యూరిటీని చూపించాడు. ప్రీ క్లైమాక్స్ నుంచి క్లైమాక్స్ సన్నివేశాల్లో తనలోని నట విశ్వరూపాన్ని చూపించే ప్రయత్నం చేశాడు. నారా రోహిత్, మనోజ్‌తో పాత్రలతో మమేకమై మంచి బాండింగ్‌ను ఆన్ స్క్రీన్‌పై ఎలివేట్ చేశాడు. ఇక మనోజ్ మంచు నటుడిగా మరో రేంజ్ పెర్ఫార్మెన్స్ చేశాడు. కాస్త విరామం తీసుకొన్నప్పటికీ.. సూపర్ క్యారెక్టర్‌తో రీ ఎంట్రీతో అదరగొట్టాడు. ఇండస్ట్రీలో తన టైమ్ స్టార్ట్ అయిందని గజపతి పాత్ర ద్వారా చాటి చెప్పాడు. నారా రోహిత్ విషయానికి వస్తే.. వరద పాత్రలో హుందాగా కనిపించాడు. తన పాత్రకు ఎంత ఎమోషన్ కావాలి? ఎంత యాక్షన్ కావాలో అంతే సమతుల్యాన్ని పాటించి సటిల్‌గా స్క్రీన్ పై కనిపించాడు. ఇక నాన్నమ్మగా జయసుధ పాత్ర అంతంత మాత్రమేగానే ఉన్నప్పటికీ.. స్క్రీన్ మీద కనిపించినంత సేపు ఆమె ప్రజెన్స్ బాగుంది. ఈ సినిమా కథను నడిపించే పాత్రలో నీలిమగా ఆనంది నటన బాగుంది. కేవలం గ్లామర్ పరంగానే కాకుండా ఆనంది పాత్రల స్వరూపాన్ని, సినిమా కథ దిశను మార్చే పాత్రలో ఒదిగిపోయింది. ఇక నారా రోహిత్ భార్య పాత్రలో పూర్ణిమగా దివ్య పిళ్లై ఎమోషనల్ కంటెంట్‌ను సినిమాకు అందించే విధంగా పెర్ఫార్మ్ చేశారు. వెన్నెల కిషోర్ కామెడీ పెద్దగా వర్క్ కాలేదు. సంపత్ రాజ్, శరత్, అజయ్, ఇతర పాత్రలు సినిమాలో గుర్తుంచుకొనే పాత్రల్లో కనిపించారు.

టెక్నికల్ అంశాల విషయానికి వస్తే.. ఈ సినిమాకు శ్రీ చరణ్ పాకాల మ్యూజిక్ ప్రధానమైన బలంగా మారింది. బ్యాక్ గ్రౌండ్ స్కోర్‌తోనే కాకుండా హీరోల ఇంట్రడక్షన్ సాంగ్ సంక్రాంతి పాట, అలాగే వెన్నెల, గిచ్చు గిచ్చు సాంగ్ ఆడియో పరంగా ఫుల్ జోష్‌ను కలిగిస్తే.. తెర మీద అదే జోష్‌ను చూపించారు. ఇక ఈ సినిమాలో మంచి మాస్ యాక్షన్ ఎపిసోడ్స్ ఉన్నాయి. వాటితో గ్రామంలోని వాతవరణాన్ని హరి కె వేదాంతం చక్కగా, చాలా సహజంగా చిత్రీకరించాడు. కేకే రాధామోహన్ ఈ మూవీని రాజీ లేకుండా మంచి క్వాలిటీతో సినిమాను అందించారు. ప్రొడక్షన్ వాల్యూస్ హై స్టాండర్డ్‌లో ఉన్నాయి. కంటెంట్‌పై మరింత దృష్టిపెట్టి ఉంటే బెస్ట్ మాస్ యాక్షన్ మూవీ అయి ఉండేదనిపిస్తుంది. తమిళంలో సూపర్ హిట్ అయిన గరుడన్ సినిమాకు భైరవం రీమేక్. ఈ సినిమాలో అన్ని రకాలు ఎమోషన్స్ ఉంటాయి. కొన్ని చోట్ల భావోద్వేగాలు లోపించాయి. యాక్షన్ పార్ట్ సినిమా ఫ్లేవర్‌ను మార్చేసింది. పాటల బాగున్నప్పటికీ వాటి ప్లేస్‌మెంట్ సరిగా లేకపోవడం వల్ల మంచి ఫ్లోలో వెలుతున్న స్టోరికి బ్రేకులు వేశాయా? అనిపిస్తుంది. ఈ సినిమా పక్కా మాస్ ఎంటర్‌టైనర్. బెల్లంకొండ శ్రీను, నారా రోహిత్, మనోజ్ మంచు ఫెర్ఫార్మెన్స్ ఈ సినిమాకు హైలెట్. కథ పరంగా పాత కథే.. కాకపోతే డిఫరెంట్‌గా చేయాలన్న ప్రయత్నం కొంత ట్రాక్ తప్పింది. టోటల్‌గా ఈ సినిమాను థియేటర్‌లో ఓసారి చూసేయొచ్చు అనేది నా అభిప్రాయం.




PRINTED, PUBLISHED & and OWNED by T VIJAYANAND, And PRINTED at M/S JBN PUBLICATIONS, # 2/381-A - RAGITHOTA PALEM, Near SHALOM CHURCH, Tadipatri - 515411 Anantapuram District, Andra Pradesh. Published at M/S JBN PUBLICATIONS, # 2/381-A, RAGITHOTA PALEM, Near SHALOM CHURCH, Tadipatri - 515411 Anantapuram District, Andra Pradesh. PIN - 515411. Editor T VIJAYANAND, RNI NO: APTEL/2015/72694. Cell : 8886090199. E-mail ID : ananthaprabha@gmail.com